క్లుప్తంగా

అప్రెంటిస్ మేళాకు స్పందన



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శ్రీరాంపూర్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం నిర్వహించిన అప్రెంటిస్ షిప్ మేళాకు మంచి స్పందన లభించింది. ఈ మేళాలను మంగళవారం నిర్వహించగా మొత్తం 156మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రికల్, డీజిల్ మెకానికల్ తదితర ట్రేడ్స్‌లో పలు సంస్థలు అప్రెంటీస్‌షిప్‌ను ఆఫర్ చేశాయి. హాజరైన వారిలో 95మంది విద్యార్థులు పరీక్షలో ఉత్తీర్ణత సాధించి అప్రెంటీస్‌షిప్‌కు ఎంపికయ్యారని కాలేజీ ప్రిన్సిపల్ ఎం.చందర్ తెలిపారు.

విజేతలకు జీఎం అభినందన



ట్రోఫీని జీఎంకు అందిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: కంపెనీ స్థాయి క్రికెట్ పోటీల్లో విజయం సాధించిన బెల్లంపల్లి రీజియన్ క్రికెట్ జట్టును శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అభినందించారు. ఇటీవల కొత్తగూడెంలోని రుద్రంపూర్‌లో కంపెనీ స్థాయి సీనియర్, జూనియర్ అధికారుల క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇందులో బెల్లంపల్లి రీజియన్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని అందుకుంది. ఈ రీజియన్ జట్టులో ఏరియా అధికారులు పాల్గొన్నారు. మంగళవారం వీరంతా తాము సాధించిన ట్రోఫీతో జీఎంను కలిశారు. జీఎం వారిని అభినందించారు. ముందు కూడా క్రీడల్లో రాణించి ఏరియాకు పేరు తేవాలన్నారు.

‘ఓపెన్’ ప్రవేశాలకు గడువు పెంపు

దండేపల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో 2023–24 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 11వరకు గడువు పెంచినట్లు దండేపల్లి ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ శంకర్ గౌడ్, సహాయ కో ఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు దండేపల్లి ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రంలో సంప్రదించవచ్చన్నారు.

ఐటీఐలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. మంచిర్యాల ఐటీఐని మంగళవారం సందర్శించారు. శిథిలమైన భవనాలు తొలగించి పక్క భవనాలు నిర్మించాలన్నారు. ఐటీఐ స్థలం కబ్జాకు గురికాకుండా ప్రహరీ నిర్మించాలని సూచించారు. అంతకుముందు ఎస్సీ హాస్టల్‌ను పరిశీలించారు. మెస్‌చార్జీలు పెంచాలన్నారు. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు, సకాలంలో బిల్లులు అందించాలని డిమాండ్ చేశారు.

సత్యదేవుణ్ని దర్శించుకున్న దివాకర్‌రావు



సత్యదేవుణ్ని దర్శించుకుంటున్న దివాకర్‌రావు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామిని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మంగళవారం దర్శించుకున్నారు. గూడెం ఎత్తిపోతల ద్వారా ఆయకట్టుకు అందుతున్న సాగు నీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండాలని సత్యదేవున్ని మొక్కుకున్నట్లు దివాకర్‌రావు తెలిపారు.ఆలయ అధికారులు ఆయనకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించగా, అర్చకులు ఆశీర్వచనం చేశారు. డీసీఎమ్మెఎస్ చైర్మన్ లింగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

18వ వార్డు సందర్శన



బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి 18వార్డును మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఆర్.భుజంగరావు సందర్శించారు. వార్డుపరిధిలోని వీధులన్నీ కలియతిరిగి మురికి నీటి కాలువలు, అంతర్గత రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని కమిషనర్ అభయం ఇచ్చారు. కమిషనర్ వెంట వార్డు ప్రజలు కె.శ్రీనివాస్, పి.హరీష్, శంకరయ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ ఉన్నారు.

పబ్లిక్ పరేషాన్..!

- మున్సిపాలిటీల్లో అధ్వానంగా ప్రజా టాయిలెట్స్
- నిర్వహణ లేక కంపు కొడుతున్న మరుగుదొడ్లు
- గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే వారికి ఇవే దిక్కు
- జనాభాకు సరిపడా లేక ప్రజలకు ఇబ్బందులు
- కొత్త వాటి నిర్మాణంపై దృష్టి సారించని అధికార యంత్రాంగం

జిల్లాలోని మున్సిపాలిటీల్లో కొన్నేళ్లుగా జనాభా గణనీయంగా పెరిగింది. వ్యాపారాలు ఊపందుకోవడంతో సమీప గ్రామాల నుంచి రాకపోకలూ పెరిగాయి. అయితే నిత్యం జన సందడితో ఉండే బల్దియాల్లో సరిపడా పబ్లిక్ టాయిలెట్లు కనిపించడం లేదు. పన్నుల రూపంలో మున్సిపాలిటీలకు ఆదాయం వస్తున్నా కొత్తవాటి నిర్మాణంపై అధికార యంత్రాంగం దృష్టి సారించడం లేదు. కనీసం ఉన్న వాటి నిర్వహణను కూడా పట్టించుకోకపోవడంతో మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. ‘అత్యవసరం’లో వినియోగించుకునేందుకు కనీసం నీటి సౌకర్యం కూడా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం పక్కన నిరుపయోగంగా షీ టాయిలెట్స్

జిల్లా కేంద్రంలో నిరుపయోగంగా షీ టాయిలెట్స్

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో మూడు చోట్ల ఏర్పాటు చేసిన షీ టాయిలెట్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఒక్కో టాయిలెట్‌ను దాదాపు రూ.4.50లక్షల వ్యయంతో నిర్మించినా, అవి పూర్తయిన నాటి నుంచి వినియోగంలో లేకుండాపోయాయి. వీటికి అవసరమైన నీటి వసతిని కల్పించేందుకుగాను బోర్‌వెల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉన్నా, వాటి నిర్మాణాలను చేపట్టకపోవడంతో, టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌ను ఆనుకుని ఒకటి, ఫైర్ స్టేషన్ సమీపంలో ఒకటి, బస్టాండులో ఒకటి ఇలా మూడు చోట్ల నిర్మించినవి నిరుపయోగంగా ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయం పక్కనే నిర్మించిన టాయిలెట్లు పూర్తిగా పిచ్చి మొక్కలు పెరిగి, కనీసం అక్కడికి వెళ్లేందుకు అవకాశం కూడా లేదు. నీటి వసతి లేకపోవడంతో, టాయిలెట్ పైన ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు నిరుపయోగంగా మారగా, టాయిలెట్లు సైతం వినియోగించలేని స్థితిలో ఉన్నాయి.

లక్సెట్టిపేటలో నిరుపయోగంగా...

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో గాంధీ చౌక్, అంబేద్కర్ చౌరస్తా వద్ద మున్సిపల్ అధికారులు పబ్లిక్ టాయిలెట్లను కొన్నేళ్ల క్రితం నిర్మించారు. ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లు నిరుపయోగంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గాంధీచౌక్ వద్ద అప్పుడప్పుడు తెరుస్తుండగా, అంబేద్కర్ చౌరస్తా వద్ద మూడు నెలల నుంచి తెరవడం లేదు. ప్రతి గురువారం వారసంత ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పబ్లిక్ టాయిలెట్లను ఉపయోగించేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌ను వివరణ కోరగా త్వరలోనే ఉపయోగించేలా చూస్తామని తెలిపారు.



అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరుపయోగంగా

కంపుకొడుతున్నయ్..!



యూనియన్ బ్యాంకు ఎదుట టాయిలెట్

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో పబ్లిక్ టాయిలెట్స్‌ల నిర్వహణ సరిగ్గా లేదు. రోజువారీగా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాల్సి ఉండగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దుర్గంధం వెదజల్లుతోంది. ప్రజలు వినియోగించుకోలేకపోతున్నారు. మున్సిపాలిటీలో యూనియన్ బ్యాంకు వద్ద, తహసీల్దార్ కార్యాలయం ఎదుట పబ్లిక్ టాయిలెట్లను నిర్మించారు. వీటిలో తహసీల్ కార్యాలయం ఎదుట పబ్లిక్ టాయిలెట్‌ను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురాగా, యూనియన్ బ్యాంకు ఎదుట మూడేళ్ల క్రితం నిర్మించిన టాయిలెట్‌ను ప్రారంభించలేదు. బజారుఏరియాకు, బ్యాంకుకు వచ్చే ప్రజలు అత్యవసరంగా మూత్ర విసర్జన ,మరుగు దొడ్డి కోసం ఈ టాయిలెట్‌ను వాడుకుంటున్నారు. నీటి సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో పబ్లిక్ టాయిలెట్ నుంచి భరించలేని కంపువాసన వస్తోందని పుర ప్రజలు పేర్కొంటున్నారు. పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై మున్సిపల్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రోజురోజుకు అధ్వాన్నంగా తయారవుతున్నాయి. సరిపడా సిబ్బందిని నియమించకపోవడంతో శుభ్రం చేసే దిక్కులేకుండా పోయి, కంపు వాసన వస్తున్నట్లు పురప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికా రులు స్పందించి టాయిలెట్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చెన్నూర్ మున్సిపాలిటీలో ఒక్కటే...



చెన్నూర్ కొత్త బస్టాండ్‌లో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్

చెన్నూర్: మున్సిపాలిటీలో ఒక్కటే పబ్లిక్ టాయిలెట్ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో 25,543మంది జనాభా ఉంది. జనాభా ప్రతిపాదికన గతంలో మున్సిపాలిటీ పరిధిలో కొత్త బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రెండు పబ్లిక్ టాయిలెట్లు నిర్మించారు. ఆసుపత్రి నూతన భవన నిర్మాణంలో భాగంగా పబ్లిక్ టాయిలెట్‌ను కూల్చివేశారు. ప్రస్తుతం కొత్తబస్టాండ్ వద్ద ఒక్కటే పబ్లిక్ టాయిలెట్ ఉంది. చెన్నూర్ మున్సిపాలిటీ చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మూడు మండలాలకు కేంద్ర బిందువు కావడంతో ప్రతిరోజు వేలాది మంది గ్రామీణులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం బస్టాండ్ వద్ద గత టాయిలెట్‌లో నీటి సౌకర్యం ఉంది. ప్రజలు వినియోగిస్తున్నారు.

ఆర్‌కేపీలో నిర్మాణ దశలోనే ...

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో సింగరేణి ఆధ్వర్యంలోని సులభ్‌కాంప్లెక్స్‌లు తప్ప పబ్లిక్ టాయిలెట్స్ లేవు. రామకృష్ణాపూర్‌లోని బీజోన్ రాజీవ్‌చౌక్‌లో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం కోసం రూ.30లక్షలు గతంలోనే మంజూరు అయినప్పటికీ, ఇంకా నిర్మాణదశలోనే ఉంది. సకాలంలో బిల్లులు రాకపోవడంతో టాయిలెట్స్ నిర్మాణపు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో కూరగాయల కొనుగోలు, ఇతర మార్కెట్ అవసరాల నిమిత్తం బీజోన్‌కు వస్తున్న ప్రజలు టాయిలెట్స్ లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు టాయిలెట్స్ నిర్మాణం వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నిర్మాణం పూర్తికాని టాయిలెట్స్

మందమర్రిలో నీటి సౌకర్యం లేదు..



మున్సిపాలిటీ సమీపంలో ఓపెనింగ్‌కు సిద్ధంగా

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలో 24వార్డులుండగా, 9వార్డులు సింగరేణి పరిధిలోకి వస్తాయి. సింగరేణి పలుచోట్ల పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేసినా, మున్సిపాలిటీ పరిధిలో పబ్లిక్ సంచరించే స్థలాల్లో మాత్రం పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కూరగాయల మార్కెట్ ఏరియాలో, మార్కెట్ బస్టాండ్ ఆవరణలో నిర్మించిన టాయిలెట్స్‌కు నీటిసౌకర్యం లేదు. మందమర్రి పాత బస్టాండ్‌కు సుమారు వంద మీటర్ల దూరంలోని మున్సిపాలిటీ ఆఫీస్ ఆవరణలో టాయిలెట్స్ నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా, ఇంకా ఓపెనింగ్‌కు నోచుకోలేదు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ గద్దె రాజును వివరణ కోరగా మున్సిపాలిటీ సమీపంలో నిర్మించిన టాయిలెట్స్‌ను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే మార్కెట్ ఏరియా, బస్టాండ్ ఏరియాలో టాయిలెట్స్ పరిశీలించి నీటి సరాఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నస్పూర్‌లో నయం..!

నస్పూర్: పట్టణ పరిధిలో మొత్తం 48పబ్లిక్ టాయిలెట్స్ ఉన్నాయి. అన్నీ సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నడపబడుతున్నాయి. ప్రస్తుతానికి అన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయి. పబ్లిక్ టాయిలెట్స్ వద్ద పని చేసే లేబర్‌కి ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం వర్తింపజేయాలని వారు కోరుతున్నారు.



సీసీసీ సుభాష్‌నగర్‌లోని పబ్లిక్ టాయిలెట్

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



స్వాధీనం చేసుకున్న వాహనాలతో సీఐ, ఎస్సైలు

రామకృష్ణాపూర్: స్థానిక క్యాతనపల్లి రైల్వే గేటు వద్ద మంగళవారం మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. సీఐతో పాటు నలుగురు ఎస్సైలు రైల్వేగేటుతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 13ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడంతో పాటు 42మందికి చలాన్లు విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఒకరిపై కేసు నమోదు చేశారు. సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఇతర ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యంతాగి నడిపినా, రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోయినా కఠిన చర్యలు తప్పవన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనాల యజామనులపై కేసులు పెడుతామని హెచ్చరించారు. మందమర్రి సర్కిల్ ఎస్సైలు రాజశేఖర్, ఆంజనేయులు, చంద్రకుమార్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని కాంటా చౌరస్తా, శివారు ప్రాంతాల్లో వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల వారీగా పోలీసులు వేర్వేరుగా పలుచోట్ల వాహనాలను ఆపి తనిఖీ నిర్వహించారు. వాహనాల ధ్రువపత్రాలు పరిశీలించారు. వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. నిబంధనలకు అనుగుణంగా వాహనాలకు నంబర్ ప్లేట్ కలిగి లేని, రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులను గుర్తించారు. నంబర్ ప్లేట్ లేని 7బైక్‌లు సీజ్ చేశారు. మరో 67 ఈ–చలాన్స్, ఒకరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ తెలిపారు. టూటౌన్ పోలీసులు వాహనాలను తనిఖీ చేసి నంబర్ ప్లేట్ లేని 25బైక్‌లను సీజ్ చేశారు. మరో 20ఈ చలాన్స్ కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై రమేష్ ప్రకటించారు. తనిఖీల్లో వన్‌టౌన్ ఎస్సై ప్రవీణ్, టూటౌన్, తాళ్లగురిజాల ఎస్సైలు రమేష్, నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్ష శిబిరానికి స్పందన



బెల్లంపల్లి: శిబిరం ప్రారంభిస్తున్న క్లబ్ నిర్వాహకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి లయన్స్ క్లబ్, శాంభవి విజన్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 60మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 13మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి ఉచిత కంటి ఆపరేషన్‌కు సిఫారసు చేశారు. కార్యక్రమంలో కొంకటి అంజయ్య, సింగరేణి లయన్స్ క్లబ్ కార్యదర్శి చక్రపాణి, లయన్స్ క్లబ్ శ్రేణులు పెద్ది రాజేందర్, నల్మాస్ సంతోష్, మాక్స్ విజన్ పరీక్ష నిపుణులు అమోఘ, సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాలలో 46 మందికి కంటి ఆపరేషన్లు..

మంచిర్యాలటౌన్: పట్టణంలోని గర్మిళ్ల లయన్స్ క్లబ్, కరీంనగర్‌కు చెందిన రేకుర్తి కంటి ఆసుపత్రి వారు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కంటి సమస్యలను గుర్తించిన 46మందికి మంగళవారం రేకుర్తి వైద్యులు ఉచితంగా కంటి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు.

ఘనంగా భీమదేవర పండగ

కోటపల్లి: మండలంలోని లింగన్నపేటలో భీమదేవర జెండా పండగను సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఆదివాసీలు భక్తి శ్రద్ధలతో గ్రామంలోని దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఆదివాసీ కుల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఏలో ఉత్తీర్ణత సాధించిన నవ్యశ్రీ



తల్లిదండ్రులతో నవ్యశ్రీ

మందమర్రిరూరల్: ఏరియాలోని ప్రాణహిత కాలనీలో నివసించే సింగరేణి ఉద్యోగి వీరవేణి రాజయ్య–మంగ దంపతుల కూతురు నవ్యశ్రీ మంగళవారం వెలువడిన సీఏ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించింది. పట్టణంలోని కార్మెల్ హైస్కూల్‌లో 2012–13వ సంవత్సరంలో పదో తరగతి చదివిన మంగ ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలల్లో చదివింది. సీఏ కావాలనే ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదలతో చదివింది.

లాకర్లు ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్: గనులపై కార్మికులు వారి సామగ్రి భద్రపరుచుకోవడానికి లాకర్లు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు గుళ్ల బాలాజీ, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, నాయకులు నరేశ్ మంగళవారం ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల ఆర్కే 5గనిలో లాకర్లు పగలగొట్టి దొంగలు కార్మికుల పర్సులు, సెల్‌ఫోన్లు దోచుకెళ్లారన్నారు. చాలా గనులపై సరైన భద్రత లేదన్నారు. సేఫ్‌గా ఉండే లాకర్లును సమకూర్చాలన్నారు.

పర్యావరణం–సంక్రాంతిపై ముగ్గుల పోటీలు



ముగ్గులు పరిశీలిస్తున్న శ్రావణి, ఉపాధ్యాయులు

జైపూర్: మండలంలోని ముదిగుంట ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పర్యావరణం–సంక్రాంతి సంప్రదాయంపై విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి డివిజనల్ మేనేజర్ శ్రావణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంక్రాంతి పండుగకు, పర్యావరణానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణంపై అవగాహన పెపొందించుకోవాలన్నారు. స్థానిక సర్పంచ్ దుగుట జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు విజయదుర్గ, శ్రీలతలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్లు సురేశ్, లక్ష్మణ్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు పవన్, ఫీల్డ్ అసిస్టెంట్లు, వాచర్లు, శ్రీనివాస్, రాజేశ్, శంకర్, సాయికిరణ్, షాహిద్, సాయి పాల్గొన్నారు.

పీఆర్‌సీ ప్రకటించాలి



కన్నెపల్లి హైస్కూల్‌లో క్యాలెండర్ ఆవిష్కరిస్తూ...

భీమిని/తాండూర్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీరాములు, రాజేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ మంగళవారం డిమాండ్ చేశారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని హైస్కూల్‌లో, తాండూర్ మండలం తంగళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తపస్ క్యాలెండర్లను వారు ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు సంబంధించి అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. మూడు డీజీలను ప్రకటించి పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాములోరి అక్షింతలకు ఘన స్వాగతం



చెన్నూర్‌రూరల్/నెన్నెల/భీమిని/జన్నారం/చెన్నూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం పంపిణీ చేశారు. అక్షింతల పల్లకికి మహిళలు మంగళహారతులతో, హిందూ బంధువులు నృత్యాలు, బాజాభజంత్రీలతో ఘన స్వాగతం పలికారు.

సంక్షిప్త వార్తలు

క్యాలెండర్ ఆవిష్కరణ

కాసిపేట: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలు దేవాపూర్, దర్మరావుపేట స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎంలు రమేష్ రాథోడ్, సుధాకర్ ఆవిష్కరించారు.

నర్సరీ పరిశీలన

భీమారం: మండలంలోని బూర్గుపల్లిలో ఏర్పాటు చేసిన నర్సరీని మంగళవారం ఎంపీడీవో శ్రీనివాస్ సందర్శించారు. మొక్కలకు నీరందించాలని కూలీలకు ఆదేశించారు.

ఉపకార వేతనాలు పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దొనబండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హాజీపూర్ మండలంలోని దొనబండ, సబ్బెపల్లి, రాపల్లి, గఢ్‌పూర్, ముల్కల్ల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున 50మందికి ఉల్లాస్ ట్రస్ట్ తరుపున ఉపకార వేతనాలు అందజేశారు.

కేంద్రప్రభుత్వ పథకాలపై అవగాహన

కోటపల్లి: మండలంలోని బొప్పారంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అవగాహన కల్పించారు. నోడల్ ఆఫీసర్ ప్రశాంత్, ఎంఎల్‌హెచ్‌పీ ఇంద్రజ, విజయలక్ష్మి, ఆశకార్యకర్త మల్లక్క, కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

దండేపల్లి: మండలంలోని ద్వారక, వెలగనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు దండేపల్లి బ్రాంచి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సులు నిర్వహించారు.

ఫర్టిలైజర్ దుఖాణాల్లో తనిఖీలు

జన్నారం: మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుఖాణాల్లో మంగళవారం వ్యవసాయాధికారి సంగీత తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. బిల్ బుక్‌లు, డీడీలు పెండింగ్‌లో ఉంటే పూర్తి చేసుకోవాలని దుఖాణదారులకు సూచించారు. ఈ పాస్ మిషన్ల ద్వారా ఎరువుల విక్రయాలు జరపాలని సూచించారు.

జీవో 50ని వెనక్కి తీసుకోవాలి

చెన్నూర్: రంగారెడ్డి జిల్లా రాజేందర్‌నగర్‌లో గల వ్యవసాయ యూనివర్సిటీ స్థలంలో నుంచి 42.05 ఎకరాల భూమిని హైకోర్టుకు కేటాయిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 50ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.